క్లుప్తంగా

డాక్టర్ ఎస్‌కే వలీకి పురస్కారం


అంతర్జాతీయ పురస్కారం అందుకుంటున్న వలీ

సీటీఆర్ఐ: ఓం శ్రీ ప్రొఫెషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధినేత డాక్టర్ ఎస్‌కే వలీ బెస్ట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని నవభారత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో గురువారం ఇంటర్నేషనల్ అవార్డ్స్ 23 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సౌత్ కొరియాకు చెందిన పీస్ ప్లాంటర్ డాక్టర్ ఐజాక్ కిమ్ చేతుల మీదుగా వలీ పురస్కారం అందుకున్నారు. కార్మిక ఉపాధి కల్పన, సామాజిక సేవలు, బలహీన వర్గాలకు చేస్తున్న ఆయన సేవలకు గాను ఈ గౌరవం లభించింది. కార్యక్రమంలో లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వీజేఈ కెరోలిన్, సీఎల్ఎఫ్ డైరెక్టర్ ఏఈ జాయ్ కుమార్ పాల్గొన్నారు.

12న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాల రేవులోని గోషాయి మఠం, నంది మంటపం, గోదావరి మాత ఆలయాల్లో భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు, రవికలు, చీరలను ఏడాది పాటు సేకరించుకునే హక్కుకు ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు మఠం కార్యనిర్వహణాధికారి పి.తారకేశ్వరరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. జూలై 26 నుంచి సేకరణ హక్కు అమల్లోకి వచ్చి ఏడాది పాటు ఉంటుందన్నారు. మఠం కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలతో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

సీటీఆర్ఐ: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీఎస్ఎన్ఎల్ జీఎం పి.రాజు అన్నారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ సంచార భవన్ ప్రాంగణంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలలో మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. అంతే కాకుండా వాయుకాలుష్యాన్ని నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో డీజీఎం వి.రాజశేఖర్, ఏజీఎం బి. శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుళ్ల సర్పంచ్‌కు ఆకుల వీర్రాజు పరామర్శ


వీరాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆకుల వీర్రాజు

కడియం: మాతృవియోగంతో బాధపడుతున్న దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, కుటుంబ సభ్యులను గురువారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. వారి తల్లి వీరాయమ్మ మృతికి సంతాపం తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు తోకల వీరవెంకట్రావు, టేకి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, ఇందుపురాల శ్రీను, వార్డు సభ్యులు పిచ్చుక చినవెంకట్రావు ఉన్నారు. కడియపులంక గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు ఆలమూరి శ్రీను తండ్రి వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను వీర్రాజు పరామర్శించారు. ఆయన వెంట బోడపాటి సత్యనారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ నెహ్రూ నగర్ స్కూల్, వాడపల్లి డీటీఆర్ ఏరియా, పుల్లర్తి వీధి, అంబేడ్కర్ విగ్రహం, చిన్న మసీదు, రాజేంద్ర నగర్, ప్రకాశం నగర్, ఆంధ్రా బ్యాంక్ ఏరియా, లేడీస్ క్లబ్, భాస్కర్ రాజు హాస్పిటల్ ప్రాంతం, వడ్డీల వారి వీధి, లైఫ్ మెడికల్ ఏరియాలో సరఫరా ఉండదన్నారు.

అత్యుత్తమ ర్యాంకు సాధనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థ అత్యుత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రజలను భాగస్వాములు చేయాలని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. ఇందులో భాగంగా ఏడాది కాలంలో నగరపాలక సంస్థ చేపట్టిన పారిశుధ్య పనులను గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ పరంగా చాలా మార్పులు చేశామని, అందులో భాగంగా డంపింగ్ యార్డులో కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తను ప్రాసెస్ చేయడానికి బయోమైనింగ్ చేయిస్తున్నామన్నారు. పాడిచెత్తను రీసైక్లింగ్ చేయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా బ్లాక్ సోల్జర్ ఫ్లై కంపోస్టింగ్ చేయిస్తున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య సిబ్బంది తమ విధులను శ్రద్ధగా నిర్వహించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలను నిత్యం శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న, ఈఈ అలీ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ధ్రువీకరణ పత్రాల పంపిణీ


జేగురుపాడులో పత్రాలు అందజేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్


మాధవరాయుడుపాలెంలో పత్రాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కడియం: ప్రభుత్వ పథకాలతో పాటు, సేవలను కూడా నేరుగా లబ్ధిదారుల వద్దకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని జేగురుపాడు, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అధ్యక్షతన ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి చందన నాగేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ పత్రాలను అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమన్నారు. గుర్తించిన వారికి వెంటనే ఆయా సేవలను అందిస్తున్నారన్నారు. ఇందు కోసం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో 950 మందికి వివిధ రకాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.రాధాకృష్ణ, ఎంపీడీవో కె.రత్నకుమారి పాల్గొన్నారు.

● మాధవరాయుడుపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుజాత, ఈఓపీఆర్‌డీ పీవీవీఎస్ లక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, స్థానిక నాయకులు సంగిత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందిరా కాలనీలో పర్యటన

ధవళేశ్వరం: గ్రామంలోని ఇందిరా కాలనీలో గురువారం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పర్యటించారు. అక్కడి డ్రైనేజీలలో పూడికలను తొలగించాలని అధికారులకు సూచించారు. అలాగే మరమ్మత్తులకు కావాల్సిన ప్రతిపాదనలను పంపించాలని ఆదేశించారు. ఆయనతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

మహిళల జీవనోపాధి కల్పనకు కృషి


రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డిని సత్కరిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: మహిళలకు జీవనోపాధి కల్పించడానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం అర్బన్ అథారిటీ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి అన్నారు. జగనన్న ఎమ్మెస్సార్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు గురువారం రుడా కార్యాలయంలో షర్మిలారెడ్డిని కలిశారు. ఆమెకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. మార్చి 28 షర్మిలా రెడ్డి జన్మదినోత్సవం రోజున మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగనన్న ఎమ్మెస్సార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించారు. ఈ సెంటర్‌లో మొదటి బ్యాచ్ శిక్షణ పొందుతున్న మహిళలు రుడా కార్యాలయానికి వచ్చి ఆమెను సత్కరించారు. టైలరింగ్ టీచర్ శ్రీలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా ఆనందం


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- పార్టీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రతి ఇంటా ఆనందం నెలకొందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. హుకుంపేట డిబ్లాకులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో పార్టీ నాయకుడు తెలగరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీబ్లాక్‌లోని ఆముదాల శ్రీనివాస్, పత్రి రాంబాబు, కందుకూరి వెంకటేష్, పోసియ్య, కుమారి ఏసు, నీలకంఠం బుల్లి, రమేష్, తిరుపతి రామస్వామి, లోవరాజు, మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, సొసైటీ మాజీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, చిర్రా గణేష్, పెయ్యల రాజేష్, సచివాలయ కన్వీనర్లు తెలగరెడ్డి శ్రీను, నేమాల సుశీల, మచ్చా దుర్గాప్రసాద్, కాతేటి ఏసు, బలగం సుబ్రహ్మణ్యం, షేక్ బాజీ పాల్గొన్నారు.

బంగారుకొండకు కలెక్టర్ దీవెనలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బంగారుకొండ కార్యక్రమంలో తాను దత్తత తీసుకున్న రేలంగి ఇవాంశిక పుట్టినరోజు వేడుకకు గురువారం కలెక్టర్ మాధవీలత హాజరయ్యారు. స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సమీపంలోని ఇవాంశిక ఇంటికి జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్‌తో కలిసి ఆమె వెళ్లారు. చిన్నారితో కేక్ కట్ చేయించి, బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను బంగారుకొండ కార్యక్రమం ద్వారా దత్తత తీసుకున్న అధికారులు బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్నారన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఎస్.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


ఇవాంశికతో కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జేసీ తేజ్ భరత్

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

కంబాలచెరువు: కుటుంబ కలహాలతో మహిళా హోంగార్డు ఆత్మహత్యకు యత్నించింది. ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నివాసముంటున్న బోణి శ్రీలతకు ధవళేశ్వరానికి చెందిన శ్రీనివాసుతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో 2008లో వివాహం చేసుకున్నారు. అయితే శ్రీలతకు తెలియకుండా శ్రీనివాసు ఇంట్లోవారు కుదిర్చిన మరో మహిళను 2009లో పెళ్లి చేసుకున్నాడు. కొన్నేళ్లపాటు ఇద్దరు భార్యలతో ఒకరికొకరు తెలియకుండా కాపురం చేశాడు. కాగా.. 2018లో శ్రీలతకు హోంగార్డు ఉద్యోగం వచ్చింది. శ్రీనివాసుకి రెండో పెళ్లి అయ్యిందని ఇటీవలే ఆమెకు తెలిసింది. దీంతో వీరిద్దరూ గొడవపడసాగారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌పై శ్రీలత పోలీసు కేసు పెట్టింది. వారిద్దరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన శ్రీలతను శ్రీనివాసు తల్లి తిట్టింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీలత ఇంటికి వెళ్లి 30 వరకూ వివిధ రకాల మందు బిళ్లలను మింగేసి పడుకుంది. మర్నాడు ఉదయం ఆమె లేవకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

కంబాలచెరువు: ప్రభుత్వాసుపత్రి వైద్యులను బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఆసుపత్రి ఎంసీహెచ్ హాల్లోని కాన్ఫరెన్స్ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏవీఏ రోడ్డు బాబా నగర్ ఆరవ వీధిలోని బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు బీకే.సత్యవాణి, బీకే శ్రీదేవి హాస్పిటల్ సూపరింటెండెంట్ రమేష్, డిప్యూటీ సూపరింటెండెంట్ హేమంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నసీరుద్దీన్ షేక్, మేనేజర్ కేదారేశ్వరరావు, ఇతర వైద్య సిబ్బందిని సత్కరించారు. కరోనా సమయంలో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు వైద్య సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విశిష్టమైన సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బ్రహ్మకుమార్ సతీష్, శివ, భాస్కర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


కంప్యూటర్‌ను అందజేసిన అనంతలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి మల్లిపూడి చైతన్య రూ.60 వేలు విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు. గురువారం పాఠశాలలో మల్లిపూడి చైతన్య తల్లి అనంతలక్ష్మి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయురాలు దువ్వా నాగమణికి గ్రామపెద్దల సమక్షంలో కంప్యూటర్‌ను అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, మాజీ సర్పంచ్ నిమ్మలపూడి రామకృష్ణ, మల్లిపూడి లావణ్య, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని పుష్కరఘాట్ వద్ద 600 ఎంఎం ఆర్‌సీసీ పంపింగ్ మెయిన్ లైన్ పగిలిపోవడంతో శుక్ర, శనివారాల్లో రెండు పూటలా నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ పాండురంగారావు గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక 1, 2, 3, 4, 7, 8, 9, 10, 11, 12, 35, 37, 42, 43, 44, 50 డివిజన్లలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆ డివిజన్లలో వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌కు అభినందనలు


గూడూరి శ్రీనివాస్‌తో మాజీ కార్పొరేటర్లు, నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గురువారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మాజీ ఫ్లోర్ లీడర్ పోలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి మాట్లాడుతూ జగనన్న ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన ఈ బాధ్యతను నగరంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులను, నాయకులందరినీ కలుపుకొని సమర్థంగా నిర్వహిస్తానన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాండ్ల, తెలికుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, మాజీ కార్పొరేటర్లు ఏవీ రమణ, మంచాల బాబ్జీ, మింది నాగేంద్ర, మానే దొరబాబు, వాకచర్ల కృష్ణ, రాయుడు రాజవల్లి, బళ్లా సత్యవతి, మింది మాధవి, నాయకులు బళ్లా శ్రీనివాస్, మెండి రాజేష్ ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలి

ధవళేశ్వరం: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ధవళేశ్వరం ఇందిరా కాలనీ వద్ద గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి చందన నాగేశ్వర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చందన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పారోజు ముత్యాలు, పసలపూడి ముత్యాలు, గంపల రవి, పారోజు మధు, పారోజు చిరంజీవి, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, సచివాలయం-3 కన్వీనర్లు రేగుళ్ల రాజు, కల్యాణిరెడ్డి, తలారి ప్రసాద్, సాధనాల చంద్రశేఖర(శివ), గోలి దేవకుమార్, ఎల్‌వీ ప్రసాద్, పుట్టా పరేష్‌నాథ్ పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

సంఘానికి ప్రత్యేక రాయితీలు కల్పించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అభ్యుదయ ఆంధ్ర రాష్ట్ర వివాహ మధ్యవర్తుల సంక్షేమ సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాగోలు అభిశా కోరారు. ది రాజమండ్రి మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రత్నరాజు ఆధ్వర్యంలో గురువారం ఇన్నీస్‌పేటలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా దక్షిణ మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గణేష్, పీపుల్స్ వాయిస్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ పి.కల్పనారెడ్డి, ఏపీ జేఏసీ ఉత్తరాంధ్ర మహిళ చైర్మన్ కె.శాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, టూ టౌన్ సీఐ గణేశ్‌ను సత్కరించారు. నిడదవోలు శ్రీనివాస మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాకులపాటి శ్రీనివాస్ సమకూర్చిన దుప్పట్లను సభ్యులకు పంపిణీ చేశారు. హెల్మెట్లను అందజేశారు. జాయింట్ సెక్రటరీ నందిగోలు చిట్టిబాబు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

కడియం: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అవసరమైన అన్ని పథకాలను సీఎం జగన్ అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వేమగిరి 4లో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామదాసుపేట, సుబ్రహ్మణ్యస్వామి గుడి వీధిలో చందన నాగేశ్వర్ పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం వారికి అందజేసిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అలాగే వారు తెలిపిన తాగునీరు, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, వేమగిరి సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి అచ్యుతరామ్, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, సాపిరెడ్డి సరిబాబు, వెలుగుబంటి వెంకటాచలం, నరాల గణపతి, కట్టా జమీందార్, గుబ్బల నాగార్జున, పితాని శ్రీనివాస్, నరాల శ్రీను, పితాని హరి, యనమదల మణికంఠ, కట్టా శ్రీధర్, బైవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జూలై 10, 11న మహాధర్నా చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంబ, బేబీరాణి తెలిపారు. ఈ మేరకు గురువారం శ్యామలా సెంటర్‌లో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి పాల్గొన్నారు.

సాక్షి-సినిమాలు



శ్యామల	: రంగబలి
సూర్యమినీ	: 7–11పిఎం
సూర్యప్యాలెస్	: ఇన్సిడియస్
స్వామి	: స్పై
శివజ్యోతి	: సామజవరగమన
అనుశ్రీ	: ఆదిపురుష్
రాజా	: రంగబలి
అశోక	: రంగబలి
ఊర్వశి	: భాగ్‌సాలే
రంభ	: రుద్రంగి
మేనక	: ఓసాధియా, ఇద్దరు
అప్సర	: ఇన్సిడియస్
నామవరం	
వీఎస్ మహల్	: సామజవరగమన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: రంగబలి
కడియం	
వెంకటసూర్య	: రంగబలి, సామజవరగమన

ముళ్లచెట్లతో రాకపోకలకు అవస్థలు


గోదావరి గట్టు రోడ్డుపైకి పెరిగిపోయిన ముళ్లచెట్లు


రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

- గోదావరి గట్టు రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన చెట్లు
- వాహనచోదకుల ఇబ్బందులు

ధవళేశ్వరం: నిత్యం వందల మంది రాకపోకలు సాగించే ధవళేశ్వరం గోదావరి గట్టు రోడ్డుపైకి ముళ్లచెట్లు చొచ్చుకువచ్చాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమస్య మరింత పెరిగింది. రోడ్లపైకి చొచ్చుకు వచ్చిన ముళ్ల చెట్లు గీరుకుని వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉండటంతో అధిక శాతం ద్విచక్ర వాహన చోదకులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ఇవి తగలడంతో ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి రోడ్లకి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న ముళ్లచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

లైట్లు ఏర్పాటు చేయాలి

ధవళేశ్వరం - రాజమహేంద్రవరం ప్రధాన రహదారి రద్దీగా మారడంతో అధిక శాతం మంది గోదావరి గట్టు రోడ్డు పైనుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికంగా ద్విచక్ర వాహనాలు, కార్లు తిరుగుతాయి. రాత్రి సమయాల్లో వీధిలైట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రోడ్డుపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆవులతో అవస్థలు

గోదావరి గట్టు రోడ్డుపై కొందరు ఆవులను వదిలేస్తుండటంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి ఇవి అకస్మాత్తుగా మీదుకు రావడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పలుమార్లు వాహనాలు జారిపడి చోదకులు గాయాలపాలవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్లపై తిరిగే ఆవులను గోశాలకు తరలించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.